Postal License No.VJ/220/2023-25




# నేటి పత్రిక ప్రజా వార్త

NETI PATRIKA PRAJA VARTHA

తెలుగు వార పత్రిక



TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL

Prajavatha-Online Telugu News

http://www.prajavartha.com

వీక్షించండి .. చదవండి... చెప్పండి...




విజయవాడ | తేదీ : 16-23 మే 2025 | సంపాదకులు : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి: 04 | సంచిక : 49 | పేజీలు : 4 | రూ. 5.00


## ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం



పాణ్యం, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్రంలోని మహిళలకు శుభవార్త! ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలందరికీ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గంలో నిర్వహించిన "స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ నిర్ణయం మహిళా సాధికారతకు, వారి ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "మా ప్రభుత్వం మహిళా పక్షపాతి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు, ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రంలోని ఆడబిడ్డలందరూ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇది వారికి మేము ఇచ్చే కానుక. ఈ పథకం అమలుకు సంబంధించిన విధివిధానాలను త్వరలోనే ఖరారు చేస్తాం" అని చంద్రబాబు సభాముఖంగా ప్రకటించడంతో సభికుల నుంచి పెద్ద ఎత్తున హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చంద్రబాబు పునరుద్ఘాటించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూనే, రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తామని తెలిపారు. ఇప్పటికే 76 ప్రాజెక్టుల ద్వారా రూ. 4.96 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, తద్వారా 4.51 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 4 వేల నుంచి రూ. 15 వేల వరకు పింఛన్లు అందిస్తున్నామని, అన్న క్యాంటీన్లతో పేదల ఆకలి తీరుస్తున్నామని అన్నారు. "దీపం-2" కింద మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తామని, పాఠశాలలు తెరిచేలోగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని, "తల్లికి వందనం" కింద రూ. 15 వేలు జమ చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని భరోసా ఇచ్చారు. రైతులకు గిట్టుబాటు ధర, వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన కూరగాయలు అందించే లక్ష్యంతో 1998లో తాను ప్రారంభించిన రైతు బజార్ల వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామన్నారు. ప్రస్తుతమున్న 125 రైతు బజార్ల సంఖ్యను పెంచుతామని, కర్నూలులోని రైతు బజార్ ఆధునీకీకరణకు రూ. 6 కోట్లు కేటాయిస్తామని తెలిపారు. పాణ్యం నియోజకవర్గంలో రూ. 50 లక్షలతో ఉద్యానవన అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. అలాగే, నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ. 50 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. కర్నూలు జిల్లాలో ఇంటింటికీ సురక్షిత తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. 2029 నాటికి పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు




అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీలతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశీ సంస్థల ఆసక్తి చూపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుని వెను వెంటనే ప్రాజెక్టుల స్థాపనకు శ్రీకారం చుడుతున్నాయి. ఇప్పటికే కొన్ని సంస్థలు శంకుస్థాపనలు కూడా నిర్వహించగా... మరి కొన్ని కంపెనీలు పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకుంటున్నాయి. గత ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంపై విశ్వాసం కోల్పోయిన పారిశ్రామిక వేత్తలను తిరిగి రాష్ట్రానికి రప్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలను ఇస్తున్నాయి. 11 నెలల కాలంలో ఎస్ఐపీబీ ఇప్పటికి 6 సార్లు సమావేశం కాగా, 76 ప్రాజెక్టులకు సంబంధించి రూ. 4,95,796 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. వీటి ద్వారా 4,50,934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. తాజాగా గురువారం సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 6వ ఎస్ఐపిబి సమావేశంలో 19 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. వీటికి సంబంధించి రూ. 33 వేల కోట్లకు పైగా పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఈ పెట్టుబడుల ద్వారా దాదాపు 35 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

**ప్రాజెక్టుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ:** ఈ సందర్భంగా సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... 'రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ముందుకు వచ్చి ఒప్పందాలు చేసుకున్న సంస్థలు... ప్రాజెక్టుల శంకుస్థాపన నుంచి ప్రారంభోత్సవం వరకు అధికారులు నిరంతర పర్యవేక్షణ జరపాలి. ప్రతి ప్రాజెక్టు పురోగతిని నిరంతరం ఫాలోఅప్ చేయాలి. ఆయా సంస్థల పెట్టుబడులు, క్షేత్ర స్థాయి పనుల స్థితిగతులను తెలుసుకునేందుకు డాష్ బోర్డ్ తీసుకురావాలి. తద్వారా ఏ ప్రాజెక్టు ఏ స్థాయిలో ఉంది అనేది తెలుసుకోవచ్చు. పెట్టుబడులతో పాటు వచ్చిన ఉద్యోగాల వివరాలతో పోర్టల్ రావాలి. ఎస్ఐపిబి సమావేశాల్లో కొత్త పెట్టుబడులకు ఆమోదం తెలపడంతో పాటు... ఇప్పటికే ఆమోదం తెలిపి ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులకు సంబంధించి ప్రోగ్రెస్ వివరించాలి' అని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

**50 వేల హోటల్ రూములు లక్ష్యం:** టూరిజం ప్రాజెక్టుల ఏర్పాటుపై సిఎం చంద్రబాబు మాట్లాడుతూ...'టూరిజం సెక్టార్‌లో హోటళ్లు, రూముల కొరత ఉంది. పెద్దఎత్తున హోటల్ రూమ్‌లు వస్తే పర్యాటకానికి ఊపు వస్తుంది. 50 వేల రూమ్‌లు అందుబాటులోకి తేవాలి అనేది మన ముందున్న లక్ష్యం. హోటల్ రూమ్‌ల ధరలు అందుబాటులో ఉంటే పర్యాటకులు ఆయా ప్రాంతాల్లో బస చేస్తారు. కారవాన్స్‌కు సంబంధించి పాలసీని కూడా సిద్ధం చేసి అమల్లోకి తేవడం ద్వారా కొత్త పర్యాటకులకు కొత్త అనుభూతి కలుగుతుంది. తద్వారా పర్యాటక ఆదాయం కూడా పెరుగుతుంది. ముఖ్యంగా దేవాలయాలకు వచ్చే వారికి మంచి వసతి అనేది చాలా ముఖ్యం. కుటుంబాలతో వచ్చే వారు ప్రశాంతమైన, పరిశుభ్రమైన వాతావరణంలో ఉండాలి అనుకుంటారు. రాష్ట్రంలో రద్దీగా ఉండే 21 దేవాలయాల్లో వసతి సౌకర్యం పెంచే చర్యలు తీసుకోవాలి. టెంట్లు (గుడారాలు) ఏర్పాటు చేసి వసతి కల్పించే ప్రాజెక్టులను ప్రారంభించాలి. అదే విధంగా గోదావరి, కృష్ణా నదుల వద్ద నిర్వహిస్తున్న హారతుల కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక శోభ పెంచేలా చేపట్టాలి' (తరువాయి.. 2 వ పేజీలో)

## ప్రధాని మోదీ నుంచి సలహాలు తీసుకున్నా: మంత్రి లోకేశ్



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ఏపీ విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ కుటుంబసమేతంగా శనివారంనాడు న్యూఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిసిన విషయం తెలిసిందే. ఇటీవల ప్రధాని అమరావతి వచ్చిన సందర్భంలో ఢిల్లీ రావాలని మంత్రి లోకేశ్‌ను ఆహ్వానించిన సందర్భంగా ప్రధాని మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 'యువగళం' కాఫీ టేబుల్ పుస్తకాన్ని ప్రధాని ఆవిష్కరించారు. 2024 ఎన్నికలకు ముందు లోకేశ్ చేపట్టిన 3,132 కిలోమీటర్ల పాదయాత్ర విశేషాలను ఈ కాఫీ టేబుల్ బుక్‌లో పొందుపరిచారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రధాని దానిపై సంతకం చేసి లోకేశ్‌కు అందజేశారు. ఇక, ఈ భేటీలో ప్రధాని మోదీ, లోకేశ్ దంపతుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుమారుడు దేవాన్ష్‌ను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని సరదాగా ముచ్చటించారు.

**మోదీతో భేటీపై లోకేశ్ ట్వీట్..** ప్రధాని మోదీతో భేటీ అనంతరం మంత్రి లోకేశ్ 'ఎక్స్' వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రధానిని కలిసే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. "ఈరోజు గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో కుటుంబసమేతంగా కలవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. ఏపీ పురోగతికి ప్రధానమంత్రి అందించిన మద్దతుకు కృతజ్ఞతలు. జాతీయ భద్రత, దేశాభివృద్ధిలో ప్రధాని నిర్ణయాత్మక నాయకత్వానికి ధన్యవాదాలు. 2047 వికసిత్ భారత్ లక్ష్యానికి చేరుకోవడంలో రాష్ట్రం దేశానికి ఏ విధంగా తోడ్పడాలో ప్రధాని నుంచి సలహాలు తీసుకున్నా" అని మంత్రి లోకేశ్ ట్వీట్ చేశారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్



ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్రపతి భవన్ లో బుధవారం ఉదయం సుప్రీం కోర్టు 52వ ప్రధాన న్యాయ మూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ప్రమాణం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జస్టిస్ గవాయ్‌తో ప్రమాణం చేయించారు. ఈ ప్రమాణస్వీకార కార్యక్ర మానికి ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు,గవర్నర్లు తదితరులు హాజరయ్యా రు. జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన రెండో దళిత వ్యక్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ రికార్డులకెక్కారు. జస్టిస్ గవాయ్ 1960 నవంబర్ 24వ తేదీన మహారాష్ట్రలోని అమరా వతిలో జన్మించారు. 1985 లో లా ప్రాక్టీస్ ప్రారంభించిన తర్వాత, భోసలే వంటి సీనియర్ న్యాయవాదుల తో కలిసి పనిచేశారు. అనతికాలంలోనే స్వతం త్రంగా ప్రాక్టీస్ చేయడం ప్రారంభించారు. ఆయన మునిసిపల్ కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, కార్పొరేషన్లకు స్టాండింగ్ కౌన్సిల్‌గా కూడా పనిచేశారు...

## పాక్‌తో కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి భారత ఆర్మీ కీలక ప్రకటన

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : పాకిస్థాన్‌తో కాల్పుల విరమన ఒప్పందానికి సంబంధించి తాజాగా భారత ఆర్మీ కీలక ప్రకటన విడుదల చేసింది. ఈరోజుతో సీజ్‌ఫైర్ ముగుస్తుందన్న వార్తలను ఖండించింది. ఇండియా, పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ)ల మధ్య ఇవాళ ఎలాంటి చర్చలకు ప్లాన్ చేయలేదని తెలిపింది. కాల్పుల విరమణ అవగాహనకు ముగింపు తేదీ లేదని ప్రకటించింది. ఈ నెల 12న ఇరు దేశాల డీజీఎంఓల చర్చల్లో తీసుకున్న నిర్ణయాలే ప్రస్తుతానికి కొనసాగుతాయని ఇండియన్ ఆర్మీ స్పష్టం చేసింది. ఇక, పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత బలగాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో దాయాది పాకిస్థాన్ వణికిపోయిన విషయం తెలిసిందే. ఎదురుదాడికి ప్రయత్నించినప్పటికీ భారత బలగాల దెబ్బకు తోకముడిచింది. చివరకు ఉద్రిక్తతలు తగ్గించాలని దాయాది దేశం కాళ్ల బేరానికి రావడంతో భారత్ అంగీకరించింది. దాంతో కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. వీటికి సంబంధించి మే 12న ఇరు దేశాల డీసీఎంఓల స్థాయిలో చేసుకున్న తాత్కాలిక కాల్పుల విరమణ అవగాహనను కొనసాగించేందుకు మొగ్గు చూపినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

## కుటుంబ వ్యాపారాలకు వారసులు విముఖం

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : భారతదేశంలోని కుటుంబ వ్యాపారాల విషయంలో వారసులు బాధ్యతలు స్వీకరించడానికి అంతగా ఆసక్తి చూపడం లేదని హెచ్ఎస్‌బీసీ గ్లోబల్ ప్రైవేట్ బ్యాంకింగ్ మంగళవారం విడుదల చేసిన తాజా నివేదిక వెల్లడించింది. తమ పిల్లలు కుటుంబ సంపదను సమర్థవంతంగా నిర్వహిస్తారని 88 శాతం మంది భారతీయ వ్యాపారవేత్తలు గట్టి నమ్మకంతో ఉన్నప్పటికీ, కేవలం 7 శాతం మంది మాత్రమే కుటుంబ వ్యాపార బాధ్యతలు చేపట్టడాన్ని విధిగా భావిస్తున్నారని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఆసక్తికరంగా, 45 శాతం మంది వ్యాపారవేత్తలు తమ పిల్లలు కుటుంబ వ్యాపారంలోకి వస్తారని ఆశించడం లేదని ఈ సర్వేలో తేలింది. ఇది ప్రత్యామ్నాయ కెరీర్ మార్గాల పట్ల వారిలో పెరుగుతున్న సానుకూల దృక్పథాన్ని సూచిస్తోంది. భారత ఆర్థిక వ్యవస్థలో కుటుంబ యాజమాన్యంలోని వ్యాపారాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, దేశ జీడీపీలో వీటి వాటా ప్రపంచంలోనే అత్యధికంగా 79 శాతంగా ఉందని నివేదిక గుర్తుచేసింది. తరతరాలుగా కొనసాగుతున్న అనేక కుటుంబాల్లో, వారసులు తమకు నచ్చిన రంగాల్లో రాణించేందుకు తల్లిదండ్రుల నుంచి ప్రోత్సాహం లభిస్తోందని సర్వేలో తేలింది. అయినప్పటికీ, వ్యాపారాలను కుటుంబ సభ్యుల చేతుల్లోనే ఉంచుకోవాలనే ఆకాంక్ష వ్యాపారవేత్తల్లో బలంగా కనిపిస్తోందని, దాదాపు 79 శాతం మంది భారతీయ వ్యాపారవేత్తలు తమ వ్యాపారాన్ని కుటుంబ సభ్యులకే అప్పగించాలని యోచిస్తున్నారని తెలిసింది. హురున్ సంస్థ అందించిన డేటా ప్రకారం, భారతదేశంలో రాబోయే సంవత్సరాల్లో పెద్ద ఎత్తున తరాల మధ్య సంపద బదిలీ జరగనుంది. 2024 నాటికి దేశంలో 334 మంది డాలర్ బిలియనీర్లు ఉండగా, వారిలో దాదాపు 70 శాతం మంది సుమారు 1.5 ట్రిలియన్ డాలర్ల సంపదను తమ తర్వాతి తరానికి అందించనున్నారని అంచనా. 1990లలో ఆర్థిక సరళీకరణలు ప్రవేశపెట్టిన తర్వాత దేశంలో అనేక కుటుంబ వ్యాపారాలు పుట్టుకొచ్చాయి. విదేశాల్లో విద్యనభ్యసించి, పట్టణ వాతావరణంలో పెరిగిన ప్రస్తుత తరం యువత, వినూత్న ఆలోచనలతో సొంతంగా ఏదైనా సాధించాలని, స్వతంత్ర మార్గాల్లో పయనించాలని ఎక్కువగా కోరుకుంటున్నారని నివేదిక విశ్లేషించింది

## బ్రిటీష్ తుపాకికి గుండెను చూపిన ఆయన సాహసం మరువలేం: చంద్రబాబు

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు నివాళి అర్పించారు. ఎక్స్ వేదికగా చంద్రబాబు స్పందిస్తూ... "ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. నిరుపేద కుటుంబంలో పుట్టి, రాజకీయాల్లో ప్రముఖ వ్యక్తిగా వెలుగొంది, 'ఆంధ్ర కేసరి'గా కీర్తిప్రతిష్టలు పొందిన ఆ మహనీయుడు మనందరికి స్ఫూర్తి ప్రదాత. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొని బ్రిటీష్ తుపాకికి గుండెను చూపిన ఆయన సాహసం ఎన్నటికీ మరువలేం. శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగనిరతి ఆదర్శవంతం. ఆయనకు మరొక్కమారు ఘన నివాళి ఘటిస్తున్నాను" అని ట్వీట్ చేశారు.

## జూన్ 1 నుంచి ఏపీలో చౌక ధరల దుకాణాల ద్వారానే రేషన్ పంపిణీ ..



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 1వ తేదీ నుంచి చౌక ధరల దుకాణాల ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేస్తారని, ఎండీయూ వాహన వ్యవస్థను రద్దు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పలు ప్రాంతాల్లో అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు సైతం సమావేశాలు నిర్వహించి రేషన్ షాపుల ద్వారానే ఇకపై రేషన్ పంపిణీ జరుగుతుందని, డీలర్లు సక్రమంగా కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలని సూచనలు చేస్తున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లుగా కూడా ప్రచారం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఎండీయు వాహనాల వ్యవస్థను తొలగిస్తారని కూడా ప్రచారం జరిగింది. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సైతం ఇంటింటికి రేషన్ పేరుతో ఏర్పాటు చేసినా ఆ వాహనాలు వీధి రేషన్‌గా మారిందని విమర్శించారు. ఎండీయూ వాహనాల వల్ల ప్రజలకు మేలు జరగకపోగా, ప్రభుత్వానికి అదనపు భారం అవుతోందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో ఇంతకు ముందు రాష్ట్ర వ్యాప్తంగా చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ చేయాలా, లేక ఎండీయూ వాహనాల వల్ల ఉపయోగకరంగా ఉందా అనే విషయంపై కార్డుదారుల నుంచి ప్రభుత్వం అభిప్రాయాలను సైతం సేకరించింది. అయితే దీనిపై ప్రజల నుంచి భిన్నాభిప్రాయాలు వచ్చినట్లుగా తెలుస్తోంది. అయితే ఈ విషయంపై తాజాగా మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు. రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న మొబైల్ రేషన్ డెలివరీ (ఎండీయూ) వాహనాలు కొనసాగించాలా లేదా నిలిపివేయాలా అన్న విషయంపై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో శనివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఓ మహిళ ఎండీయూ వాహనం వచ్చినప్పుడు ఇంటి వద్ద ఉండి సరుకులు తీసుకోవడం కుదరడం లేదని, మరో సారి వాహనం రాకపోవడంతో సరుకులు కోల్పోతున్నట్లు వాపోయింది. ఈ సందర్భంగా మంత్రి పై విధంగా వ్యాఖ్యానించారు.


## బంగ్లాదేశ్‌పైనా ఆంక్షలు!



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : భారత్ బంగ్లాదేశ్‌కు బిగ్ షాక్ ఇచ్చింది. బంగ్లాదేశ్ నుంచి దిగుమతి అయ్యే రెడీమేడ్ దుస్తులు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు సహా ఇతర వస్తువులపై భారత్ ఆంక్షలు విధించింది. ఈ మేరకు వాణిజ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్టీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. తాజా నోటిఫికేషన్ ప్రకారం బంగ్లాదేశ్ నుంచి రెడీమేడ్ దుస్తులను కోల్‌కతా, నవా షెవా ఓడరేవుల ద్వారా మాత్రమే అనుమతించనున్నారు. అలాగే ఈశాన్యంలోని ల్యాండ్ ట్రాన్సిట్ పోస్టుల నుంచి కూడా పలు వస్తువుల దిగుమతిని నిషేధించింది. వీటిలో రెడీమేడ్ దుస్తులు, ప్రాసెస్డ్ ఫుడ్, ప్లాస్టిక్, ఫర్నిచర్, కార్బోనేటేడ్ పానీయాలు ఉన్నాయి. ఈ వస్తువులను మేఘాలయ, అసోం, త్రిపుర, మిజోరం, పశ్చిమ బెంగాల్‌లోని పుల్‌బారి, చంగ్రబంధలోని ల్యాండ్ కస్టమ్స్ స్టేషన్లు, చెక్ పోస్టుల ద్వారా భారత్‌లోకి అనుమతించరు. అయితే, ఈ ఆంక్షలు భారత్ గుండా భూటాన్, నేపాల్‌లకు రవాణా చేసే బంగ్లాదేశ్ వస్తువులకు వర్తించవు. బంగ్లాదేశ్ ఇప్పటి వరకు తన వస్తువులను భారత్‌లోని ఈశాన్య ప్రాంత మార్కెట్లకు ఎటువంటి పరిమితులు లేకుండా ఎగుమతి చేస్తోంది. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా మహ్మద్ యూనస్ బాధ్యతలు చేపట్టిన తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇంతకు ముందు యూనస్ చైనా పర్యటనలో ఉన్న సమయంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బంగాళాఖాతానికి బంగ్లాదేశ్ రక్షకుడని, భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలు ల్యాండ్ లాక్డ్‌గా ఉన్నాయని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో బంగ్లాదేశ్‌కు ఇస్తున్న ట్రాన్స్ షిప్‌మెంట్ సౌకర్యాన్ని భారత్ రద్దు చేసింది.

## శక్తి ఉంటేనే శాంతి.. ప్రపంచం మన సత్తా చూసింది

*: ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్*



జైపూర్, నేటి పత్రిక ప్రజావార్త : ప్రపంచ శాంతి, సంక్షేమానికి భారతదేశం దృఢంగా కట్టుబడి ఉందని, అయితే దేశం యొక్క అసామాన్యమైన బలాన్ని ప్రపంచం ఇప్పుడు చూసిందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. శక్తి ఉన్నవారి శాంతి మాటలనే ఇతరులు పరిగణనలోకి తీసుకుంటారని ఆయన శనివారం నొక్కిచెప్పారు. జైపూర్‌లోని హర్మారాలో గల రవినాథ్ ఆశ్రమంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మోహన్ భగవత్ మాట్లాడుతూ, పాకిస్థాన్‌పై ఇటీవల తీసుకున్న చర్యలను పరోక్షంగా ప్రస్తావించారు. "భారత్ ఎవరినీ ద్వేషించదు, కానీ మీ వద్ద శక్తి ఉన్నప్పుడే ప్రపంచం ప్రేమ, సంక్షేమ భాషను వింటుంది," అని ఆయన పేర్కొన్నట్లు ఒక ప్రకటన తెలిపింది. "ఇదే ప్రపంచ నైజం. ఈ స్వభావాన్ని మార్చలేం. కాబట్టి, ప్రపంచ సంక్షేమం కోసం మనం శక్తివంతంగా ఉండాలి. మన బలాన్ని ప్రపంచం చూసింది," అని భగవత్ వివరించారు. ప్రపంచ శ్రేయస్సే మన ధర్మమని, ఇది ప్రత్యేకంగా హిందూ మతం యొక్క దృఢమైన కర్తవ్యమని ఆయన ఉద్ఘాటించారు. ప్రపంచంలో శాంతి, సామరస్యం కోసం భారత్ ఒక పెద్దన్న పాత్ర పోషిస్తోందని, ఆ దిశగా కృషి చేస్తోందని తెలిపారు. శ్రీలంక, నేపాల్, మాల్దీవులు సంక్షోభాన్ని ఎదుర్కొన్నప్పుడు, వారికి మొదటగా సహాయం అందించింది భారతదేశమేనని భగవత్ గుర్తుచేశారు. భారతదేశంలో త్యాగనిరతి ఒక గొప్ప సంప్రదాయంగా వస్తోందని ఆర్ఎస్ఎస్ చీఫ్ అన్నారు. "మనం శ్రీరాముడి నుంచి భామాషా వరకు ప్రతి ఒక్కరినీ పూజిస్తాం, గౌరవిస్తాం," అని ఆయన తెలిపారు. ఈ వ్యాఖ్యల ద్వారా భారతదేశ సాంస్కృతిక విలువలను, ప్రపంచ శాంతి పట్ల దాని నిబద్ధతను, అదే సమయంలో దేశ రక్షణకు అవసరమైన బలాన్ని కలిగి ఉండాల్సిన ఆవశ్యకతను భగవత్ నొక్కిచెప్పారు.

## ఆపరేషన్ సిందూర్: ప్రపంచ దేశాలను ఆశ్చర్యానికి గురిచేసిన భారత టెక్ సత్తా

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : భారత రక్షణ రంగ స్వదేశీ పరిజ్ఞానం మరోసారి తన సత్తా చాటింది. పాకిస్థాన్ దుందుడుకు చర్యలను సమర్థవంతంగా తిప్పికొట్టడమే కాకుండా, శత్రు భూభాగంలోని ఉగ్ర స్థావరాలపై విజయవంతమైన దాడులు నిర్వహించడంలో దేశీయంగా అభివృద్ధి చేసిన రక్షణ వ్యవస్థలు కీలక పాత్ర పోషించాయి. ఈ పరిణామాలు భారత సాంకేతిక సామర్థ్యానికి, వ్యూహాత్మక ప్రణాళికకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

**పాక్ గగనతల రక్షణ ఛేదనలో భారత నైపుణ్యం..** మే 7న, కేవలం 23 నిమిషాల వ్యవధిలో, భారత వాయుసేన (ఐఏఎఫ్) పాకిస్థాన్ వద్ద ఉన్న చైనా తయారీ గగనతల రక్షణ (ఏడీ) వ్యవస్థలను ఏమార్చి, వాటిని పనిచేయకుండా జామ్ చేసి, తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై విజయవంతంగా దాడులు నిర్వహించింది. పాకిస్థాన్ హెచ్‌క్యూ-9 క్షిపణి బ్యాటరీలు, రాడార్ వ్యవస్థలు భారత దాడిని పసిగట్టడంలో విఫలమయ్యాయి. ఇది భారత ఎలక్ట్రానిక్ యుద్ధ తంత్ర నైపుణ్యానికి, సాంకేతిక ఆధిక్యతకు నిదర్శనమని ప్రభుత్వం ప్రకటించింది.

**శత్రు దాడుల తిప్పికొట్టడంలో స్వదేశీ వ్యవస్థల విజయం...** గత వారం తీవ్ర ఉద్రిక్తతల మధ్య, పాకిస్థాన్ ప్రతీకారంగా ప్రయోగించిన పలు క్షిపణులు, డ్రోన్లను భారత ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ సమర్థవంతంగా నిర్వీర్యం చేసింది. చైనా తయారీ పీఎల్-15 క్షిపణులు, టర్కీ మూలాలున్న బైకర్ యిహా కమికాజే డ్రోన్లు, అసిస్‌గార్డ్ సోంగర్ డ్రోన్ల వంటి అత్యాధునిక విదేశీ ఆయుధాలను పాక్ ప్రయోగించినప్పటికీ, భారత స్వదేశీ గగనతల రక్షణ నెట్‌వర్క్ ముందు అవి దిగదుడుపే అయ్యాయి.



**ఆపరేషన్ సింధూర్: స్వదేశీ సాంకేతికతకు పెద్ద పీట...** 'ఆపరేషన్ సింధూర్'లో భాగంగా, ఐఏఎఫ్ యొక్క పూర్తిస్థాయి ఆటోమేటెడ్ ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ (ఐఏసీసీఎస్), ఆర్మీకి చెందిన 'ఆకాశ్‌తీర్' వ్యవస్థలు కీలకపాత్ర పోషించాయి. ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్) అభివృద్ధి చేసిన ఆకాశ్‌తీర్, వివిధ రాడార్లను, గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థలను అనుసంధానించి, గగనతల వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు అందించింది. "ఆకాశ్‌తీర్ వ్యవస్థ వినియోగదారుల అంచనాలను మించి పనిచేసి, ప్రస్తుత ఘర్షణ సమయంలో భారత్‌కు పటిష్టమైన వాయు రక్షణ కల్పించింది" అని బీఈఎల్ 'ఎక్స్' లో పేర్కొంది.

**ఆకాశ్ అదుర్స్...** ఈ బహుళ అంచెల రక్షణ కవచంలో స్వదేశీ 'ఆకాశ్' క్షిపణి వ్యవస్థ (25 కి.మీ. పరిధి) ప్రముఖ పాత్ర పోషించింది. దీనితో పాటు రష్యాకు చెందిన ఎస్-400 'ట్రయంఫ్', ఇజ్రాయెల్‌తో సంయుక్తంగా అభివృద్ధి చేసిన బరాక్-8, పెచోరా క్షిపణులు, ఎల్-70 గన్‌లు, ఇగ్లా-ఎస్ క్షిపణులు, సమీకృత డ్రోన్ గుర్తింపు, నిరోధక వ్యవస్థలు కూడా ఈ నెట్‌వర్క్‌లో భాగమే. ఈ స్వదేశీ, విదేశీ వ్యవస్థల సమన్వయం మే 9, 10 తేదీలలో పాక్ వాయుసేన దాడుల నుంచి భారత వైమానిక స్థావరాలు, లాజిస్టిక్ కేంద్రాలను కాపాడటంలో విజయవంతమైంది. ఇస్రోకు చెందిన కనీసం 10 ఉపగ్రహాలు కూడా నిరంతర పర్యవేక్షణలో పాలుపంచుకున్నాయి.

**కచ్చితమైన దాడులు, స్వదేశీ ఆయుధాల వినియోగం..** కాల్పుల విరమణకు ముందు, పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది వైమానిక స్థావరాలు, రాడార్ సైట్లపై భారత్ కచ్చితమైన దాడులు చేసింది. ఇందులో బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులు, ఇతర సుదూర శ్రేణి స్వదేశీ గైడెడ్ ఆయుధాలు, డ్రోన్లు కీలక పాత్ర పోషించాయి. ఈ దాడులన్నీ భారత ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా, అత్యంత ప్రభావవంతంగా, రాజకీయంగా సమతుల్యంగా జరిగాయని ప్రభుత్వ ప్రకటన వివరించింది.

**రక్షణ స్వదేశీకరణకు లభించిన ధృవీకరణ...** 'ఆపరేషన్ సిందూర్' కేవలం వ్యూహాత్మక విజయమే కాదు, భారత రక్షణ స్వదేశీకరణ విధానాలకు లభించిన గొప్ప ధృవీకరణ అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గగనతల రక్షణ వ్యవస్థలు మొదలుకుని... డ్రోన్లు, కౌంటర్-యూఏఎస్ సామర్థ్యాల నుంచి నెట్-సెంట్రిక్ యుద్ధ తంత్ర వేదికల వరకు, ప్రతిచోటా స్వదేశీ సాంకేతికత తన సత్తా చాటింది. అరాచక యుద్ధ రీతికి ఇది ఒక బ్యాలెన్స్‌ డ్ సైనిక ప్రతిస్పందన అని, భారత్ తన సొంత ఆవిష్కరణలు, దృఢమైన ప్రభుత్వ మద్దతు, స్వదేశీ ప్రజల ప్రతిభతో ఎలాంటి సవాల్‌కైనా సన్నద్ధంగా ఉందని ఈ ఆపరేషన్ నిరూపించింది.

## సొంత వీడియోతో దొరికిపోయిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా!



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : భారత సైనిక రహస్యాలను పాకిస్థాన్‌కు చేరవేసేందుకు తీవ్ర ఆరోపణలపై ప్రముఖ ట్రావెల్ యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను అధికారులు అరెస్ట్ చేయడం తెలిసిందే. 'ట్రావెల్ విత్ జో' పేరుతో యూట్యూబ్ ఛానల్ నడుపుతున్న 33 ఏళ్ల జ్యోతి, గతంలో పాకిస్థాన్ హైకమిషన్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై, ఆ దేశంపై అమితమైన ఆసక్తిని కనబరిచిన వీడియో ఇప్పుడు కీలకంగా మారింది. ఆ వీడియోలోని సాక్ష్యాధారాలే ఈ కేసులో ఆమె మెడకు చుట్టుకున్నాయి. తాజాగా హిసార్‌లో ఆమెను అదుపులోకి తీసుకున్న అధికారులు, ఐదు రోజుల పోలీస్ కస్టడీకి తరలించారు.

**ఇఫ్తార్ విందులో పాక్ అధికారితో ఆత్మీయ పలకరింపు...** గతేడాది మార్చి 30న జ్యోతి మల్హోత్రా తన యూట్యూబ్ ఛానల్‌లో ఓ వీడియో పోస్ట్ చేశారు. ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ ఇచ్చిన ఇఫ్తార్ విందుకు తాను ఆహ్వానితురాలిగా వెళ్లినట్లు ఆ వీడియోలో ఆమె తెలిపారు. హైకమిషన్ ప్రాంగణంలోకి అడుగుపెడుతూ, అక్కడి అలంకరణను "అద్భుతం" అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. ఈ వీడియోలో, గతంలో గూఢచర్యం ఆరోపణలపై భారత్ నుంచి బహిష్కరణకు గురైన పాకిస్థాన్ హైకమిషన్ అధికారి ఎహసాన్-ఉర్-రహీమ్ అలియాస్ డానిష్‌ను ఆమె ఆప్యాయంగా పలకరించడం స్పష్టంగా కనిపిస్తుంది. వారి సంభాషణను బట్టి వారి మధ్య ముందునుంచే మంచి పరిచయం ఉన్నట్లు తెలుస్తోంది. డానిష్ కూడా జ్యోతిని అక్కడున్న ఇతర అధికారులకు 'ట్రావెల్ విత్ జో' యూట్యూబ్ ఛానల్ నిర్వాహకురాలిగా పరిచయం చేశారు.

**పాక్ పర్యటనకు తీవ్ర ఆసక్తి, వీసా కోసం వెంపర్లాట...** హైకమిషన్‌లోని వాతావరణం గురించి తన వీక్షకులకు వివరిస్తూ, జ్యోతి హిందీ, ఇంగ్లీష్ కలగలిపి, "నేను మాటల్లో చెప్పలేనంతగా ముగ్ధురాలినయ్యాను. చాలా ఉత్సాహంగా ఉన్నాను. ఎంతగానో ఆశ్చర్యపోయాను" అని వ్యాఖ్యానించారు. రహీమ్, జ్యోతిని తన భార్యకు పరిచయం చేయగా, వారు పరస్పరం పలకరించుకున్నారు. అనంతరం రహీమ్, మార్చి 23న జరుపుకునే పాకిస్థాన్ దినోత్సవం గురించి జ్యోతికి వివరించారు. "ఇంత గొప్ప స్వాగతం, ఏర్పాట్లు చూసి చాలా సంతోషంగా ఉంది" అని జ్యోతి చెప్పగా, "పాకిస్థానీయులు ఇంతే" అని రహీమ్ బదులిచ్చారు. ఈ క్రమంలో జ్యోతి, రహీమ్ దంపతులను హర్యానాలోని హిసార్‌లో ఉన్న తమ గ్రామానికి ఆహ్వానిస్తూ, "మా ఊరి ఆతిథ్యం చూడండి, చాలా బాగుంటుంది" అని అన్నారు. అంతటితో ఆగకుండా, విందులో పాల్గొన్న పలువురిని "మీరు పాకిస్థాన్ వెళ్లారా?" అని అడుగుతూ, వారు అవునని చెప్పినప్పుడల్లా "నేను కూడా వెళ్లాలనుకుంటున్నాను" అంటూ తన కోరికను వెలిబుచ్చారు. మరో యూట్యూబర్‌తో, "ఆశాజనకంగా నాకు వీసా వస్తుంది, మనం కలిసి వెళ్దాం" అని అన్నారు. అక్కడే ఉన్న కొంతమంది చైనా అధికారులను కూడా కలిసి, "నాకు వీసా ఇవ్వండి!" అంటూ చైనా వీసా కోసం కూడా అభ్యర్థించడం గమనార్హం.

**రహస్యాలు చేరవేసినట్లు అంగీకారం!...** విందు చివర్లో, కార్యక్రమ ఏర్పాట్లలో తీరిక లేకుండా ఉన్న రహీమ్‌ను మరోసారి కలిసి, తనను ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు జ్యోతి. అంతకుముందు మరో పాక్ అధికారిని కలుస్తూ, "నేను మూడు నాలుగు సార్లు ఎంబసీకి వచ్చినప్పుడు, ఈయనే నా ఎంట్రీ నమోదు చేసుకుని, నా ఫోన్, ఇతర వస్తువులను పక్కన పెట్టమన్నారు. ఈయన చాలా మంచి వ్యక్తి" అని పేర్కొంటూ, కొత్తగా విధుల్లో చేరిన మరో పాక్ అధికారిని కూడా "ఈసారి నాకు వీసా ఇప్పించండి" అని కోరారు. ఆ విధంగా, పాకిస్థాన్ వెళ్లాలన్న ఆమె కోరిక నెరవేరిందని, కనీసం రెండుసార్లు ఆ దేశానికి వెళ్లొచ్చారని విచారణ అధికారులు తెలిపారు. ఈ పర్యటనల్లో ఒకదానిలో పాకిస్థానీ భద్రతా, నిఘా అధికారులను కలిసినట్లు, ఆ తర్వాత కూడా వారితో టచ్‌లో ఉంటూ దేశ వ్యతిరేక సమాచారాన్ని పంచుకున్నట్లు జ్యోతి అంగీకరించారని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఆమె పోలీస్ కస్టడీలో ఉండగా, దర్యాప్తు కొనసాగుతోంది.


## భూ రికార్డుల ప్రక్షాళనకు కేంద్రం బృహత్ ప్రణాళిక... టెక్నాలజీతో సమగ్ర సర్వే: కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



గుంటూరు, నేటి పత్రిక ప్రజావార్త : దేశంలో భూ రికార్డుల నిర్వహణలో నెలకొన్న లోపాలను సరిదిద్ది, వివాదాలకు పుల్‌స్టాప్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఇందులో భాగంగా, కేంద్ర సమన్వయంతో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూముల సర్వే, రీసర్వే చేపట్టనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని వెల్లడించారు. సరికాని, కాలం చెల్లిన భూ రికార్డుల వల్ల తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో 'డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడ్రనైజేషన్ ప్రోగ్రామ్' కింద సర్వే/రీసర్వేపై జరిగిన జాతీయ వర్క్‌షాప్‌లో మంత్రి పెమ్మసాని ప్రసంగించారు. ఈ కార్యక్రమం కేంద్ర ప్రాయోజిత పథకమని, పూర్తిగా సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడి నడుస్తుందని తెలిపారు. డ్రోన్లు, విమానాల ద్వారా ఏరియల్ సర్వేలు చేయడం వల్ల సాంప్రదాయ పద్ధతులతో పోలిస్తే కేవలం 10 శాతం ఖర్చుతోనే సర్వే పూర్తి చేయవచ్చని ఆయన వివరించారు. కృత్రిమ మేధ (AI), జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (GIS), అత్యంత కచ్చితత్వంతో పనిచేసే పరికరాలను ఈ సర్వేలో వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం అమలులో రాష్ట్రాల సహకారం కీలకమని మంత్రి అన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన, ధృవీకరణలను రాష్ట్రాలు నిర్వహిస్తుండగా, కేంద్రం విధాన రూపకల్పన, నిధులు, సాంకేతిక సహకారం అందిస్తుందని వివరించారు. ఐదు దశల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనుండగా, మొదటి దశలో భాగంగా రూ.3,000 కోట్ల వ్యయంతో రెండేళ్ల వ్యవధిలో 3 లక్షల చదరపు కిలోమీటర్ల గ్రామీణ వ్యవసాయ భూముల్లో సర్వే చేపడతామని తెలిపారు. రికార్డ్ ఆఫ్ రైట్స్ (RoRs)తో ఆధార్ నంబర్ల అనుసంధానాన్ని పూర్తి చేయాలని రాష్ట్రాలను ఆయన కోరారు. ఈ సంస్కరణ ద్వారా భూమి యాజమాన్యాన్ని ప్రత్యేక డిజిటల్ గుర్తింపుతో ముడిపెట్టవచ్చని, తద్వారా నకిలీలను అరికట్టి, అగ్రిస్టాక్, పీఎం-కిసాన్, పంటల బీమా వంటి ప్రయోజనాలను అర్హులకు నేరుగా అందించవచ్చని సూచించారు. రీసర్వే, డిజిటలైజేషన్, కాగిత రహిత కార్యాలయాలు, కోర్టు కేసుల నిర్వహణ, ఆధార్ అనుసంధానం వంటి సంస్కరణలు సమగ్రమైన, పారదర్శకమైన భూ పరిపాలన వ్యవస్థను సృష్టిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయి వాస్తవాలకు అనుగుణంగా రికార్డులు ఉన్నప్పుడే భూమి విలువ పెరుగుతుందని మంత్రి పెమ్మసాని అన్నారు. దీనివల్ల బ్యాంకులు విశ్వాసంతో రుణాలు ఇవ్వగలవని, వ్యాపారవేత్తలు ధైర్యంగా పెట్టుబడులు పెట్టగలరని, రైతులు వ్యవసాయ మద్దతును పొందగలరని పేర్కొన్నారు. "వేగవంతమైన రహదారులు, స్మార్ట్ నగరాలు, సురక్షితమైన గృహాలు, స్థిరమైన వ్యవసాయం కావాలంటే, మనం భూమి నుంచే ప్రారంభించాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడ్రనైజేషన్ ప్రోగ్రామ్ (DILRMP) కింద గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, సర్వే, రీసర్వే అనే ముఖ్యమైన అంశం ఇప్పటివరకు కేవలం నాలుగు శాతం గ్రామాల్లోనే పూర్తయిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ పరిపాలనాపరంగా, సాంకేతికంగా, ప్రజా భాగస్వామ్యంతో కూడిన భారీ కసరత్తు అని అన్నారు. అనేక రాష్ట్రాలు మ్యాప్ ఆధారిత ఉపవిభజనలు చేపట్టలేదని, ప్రాదేశిక రికార్డులను అప్ డేట్ చేయలేదని, దీనివల్ల ప్రస్తుత కాడాస్ట్రల్ మ్యాప్‌లు వాడుకలో లేకుండా పోయాయని తెలిపారు. "రాజకీయ సంకల్పం, బలమైన సమన్వయం లేకపోతే సర్వేలు వేగం కోల్పోయి అసంపూర్తిగా మిగిలిపోతాయని మా అనుభవం చెబుతోంది" అని మంత్రి స్పష్టం చేశారు. ఈ జాతీయ వర్క్‌షాప్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ అధికారులు, నిపుణులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీ లిక్కర్ స్కాంలో కీలక పరిణామం... ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి అరెస్ట్





అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఏపీ లిక్కర్ స్కాం కేసు దర్యాప్తులో నేడు కీలక పరిణామం చోటుచేసుకుంది. సుదీర్ఘ విచారణ అనంతరం, నాటి ముఖ్యమంత్రి కార్యదర్శిగా పనిచేసిన ధనుంజయ్‌రెడ్డితో పాటు, అప్పటి సీఎం ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మూడు రోజుల పాటు వీరిని విచారించిన సిట్ అధికారులు, మద్యం కుంభకోణంలో వీరి ప్రమేయంపై స్పష్టత వచ్చిన తర్వాత ఈ సాయంత్రం అరెస్టు చేసినట్లు వెల్లడించారు. దాదాపు తొమ్మిది గంటల పాటు వీరిద్దరినీ సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఈ కేసులో ధనుంజయ్‌రెడ్డి ఏ31 నిందితుడిగా, కృష్ణమోహన్‌రెడ్డి ఏ32 నిందితుడిగా ఉన్నారు. కాగా, ఇదే కేసులో వీరికి ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. పిటిషనర్లకు వ్యతిరేకంగా తగిన ఆధారాలు ఉన్నాయని, దర్యాప్తు కీలక దశలో ఉన్నందున ఈ సమయంలో ముందస్తు బెయిల్ ఇవ్వలేమని జస్టిస్ పార్థీవాలా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే అది దర్యాప్తు అధికారి విచారణకు ఆటంకం కలిగించినట్లు అవుతుందని అభిప్రాయపడింది. అంతకుముందు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కూడా వీరి ముందస్తు బెయిల్ అభ్యర్థనను తిరస్కరించగా, ఆ తీర్పును సవాల్ చేస్తూ వీరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే, రెగ్యులర్ బెయిల్ కోసం నిబంధనలు, మెరిట్స్ ఆధారంగా హైకోర్టు లేదా ట్రయల్ కోర్టును ఆశ్రయించవచ్చని సుప్రీంకోర్టు సూచించింది. వేల కోట్ల రూపాయల మద్యం కుంభకోణంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ కేసులో, నాటి సీఎంవో కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డితో పాటు భారతి సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలను కూడా సిట్ ఇటీవల నిందితుల జాబితాలో చేర్చింది. ఈ కేసులో ఏ33 నిందితుడిగా ఉన్న గోవిందప్ప బాలాజీని సిట్ అధికారులు మంగళవారమే అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. గతంలో ఈ కేసుకు సంబంధించి మే 16 వరకు తదుపరి చర్యలు చేపట్టవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, విచారణకు హాజరుకావాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే విజయవాడలోని సిట్ కార్యాలయంలో గత మూడు రోజులుగా వీరి విచారణ కొనసాగింది. తాజాగా సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించడంతో వీరి అరెస్టుకు మార్గం సుగమమైంది.




# తెలంగాణ వార్తలు



## ఫ్యూచర్ సిటీలో విద్యుత్ సరఫరా ఎలా ఉంటుందో చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్రంలో భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని, ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఫ్యూచర్‌సిటీలో విద్యుత్ సరఫరా వ్యవస్థ పూర్తిగా భూగర్భంలోనే ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్‌సిటీలో ఎలాంటి విద్యుత్ తీగలు, టవర్లు, స్తంభాలు పైకి కనిపించకుండా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూగర్భ విద్యుత్ లైన్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి సచివాలయంలో విద్యుత్ శాఖ పనితీరు, భవిష్యత్ ప్రణాళికలపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో డేటా సెంటర్లకు ప్రధాన కేంద్రంగా (హబ్‌గా) తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందన్నారు. డేటా సెంటర్లకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అత్యంత కీలకమని, ఈ నేపథ్యంలో విద్యుత్ లైన్ల ఆధునికీకరణ, పటిష్టతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఫ్యూచర్‌సిటీ నిర్మాణం ఈ లక్ష్యాలకు అనుగుణంగా ఉండాలని, అందులో భాగంగానే భూగర్భ విద్యుత్ వ్యవస్థకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కూడా ప్రయోగాత్మకంగా స్మార్ట్‌పోల్స్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రానున్న మూడేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరగనుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఈ ఏడాది ఇప్పటికే రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరిందని, ఇది గత ఏడాది కంటే 9.8 శాతం అధికమని తెలిపారు. 2025-26 నాటికి ఇది 18,138 మెగావాట్లకు, 2034-35 నాటికి ఏకంగా 31,808 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచాలని, నూతన విద్యుత్ ఉత్పత్తి ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. అంతేకాకుండా, ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వెంబడి సౌర విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇది పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడమే కాకుండా, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

## అలా చేస్తే కఠిన చర్యలు: రియల్టర్లు, బిల్డర్లకు హైడ్రా కమిషనర్ హెచ్చరిక



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : చెరువుల్లో మట్టి, నిర్మాణ వ్యర్థాలు వేసే వారిపై కఠిన చర్యలు తప్పవని 'హైడ్రా' స్పష్టం చేసింది. చెరువుల పరిరక్షణ విషయంలో ఉపేక్షించేది లేదని, నిరంతర నిఘా ఏర్పాటు చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తేల్చిచెప్పింది. ఈ మేరకు శనివారం రియల్ ఎస్టేట్ సంస్థలు, బిల్డర్లు, రవాణాదారులతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులతో హైడ్రా అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యతకు చెరువుల పరిరక్షణ అత్యంత కీలకమని, ఈ దిశగా హైడ్రా ప్రత్యేక చర్యలు చేపడుతోందని వివరించారు. నిర్మాణ వ్యర్థాలను ఎక్కడ పారబోయాలో బిల్డర్లు, రవాణాదారులు ముందే ఒక అవగాహనకు రావాలని ఆయన సూచించారు. "మట్టి తరలింపు కాంట్రాక్టర్‌కు అప్పగించాం, ఆయన ఎక్కడ వేస్తే మాకేంటి?" అనే ధోరణిలో బిల్డర్లు వ్యవహరిస్తే, బాధ్యులందరిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు. రవాణా ఖర్చులు ఆదా చేసుకోవడానికి దగ్గరలోని చెరువుల ఒడ్డున వ్యర్థాలు వేస్తే, ఆ వాహనాలను సీజ్ చేయడమే కాకుండా, డ్రైవర్, వాహన యజమానితో పాటు వ్యర్థాలను తరలిస్తున్న నిర్మాణ సంస్థ యజమానిపైనా క్రిమినల్ కేసులు పెడతామని స్పష్టం చేశారు. శిఖం భూముల్లో కూడా ఎలాంటి మట్టినీ నింపరాదని ఆదేశించారు. ఇప్పటికే హైడ్రా పోలీస్ స్టేషన్ కూడా అందుబాటులోకి వచ్చిందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇక్కడ కేసులు నమోదు చేస్తారని తెలిపారు. చెరువుల వద్ద 24 గంటలూ పటిష్టమైన నిఘా ఉంటుందని కమిషనర్ పేర్కొన్నారు. చెరువుల్లో అక్రమంగా మట్టి, వ్యర్థాలు వేస్తున్న వారి సమాచారాన్ని అందించాలని నగర ప్రజలను హైడ్రా కోరింది. ఇందుకోసం 9000113667 అనే టోల్ ఫ్రీ నెంబర్‌ను కేటాయించినట్లు తెలిపింది. అంతేకాకుండా, హైడ్రా అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించింది.

## ఏఐ వ్యవస్థలను వాటి పాటికి వాటిని వదిలేస్తే ఏం జరుగుతుంది?




డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలో, మరో ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. మనుషుల్లాగే ఏఐ వ్యవస్థలు కూడా తమకంటూ ప్రత్యేక సమాజాలను, భాషా నియమాలను, సంప్రదాయాలను ఏర్పాటు చేసుకోగలవని ఓ తాజా అధ్యయనం తేల్చింది. వాటిని వాటి మానాన వదిలేస్తే, అవి పరస్పరం సంప్రదింపులు జరుపుకుంటూ సొంత వ్యవస్థలను నిర్మించుకుంటాయని ఈ పరిశోధన స్పష్టం చేసింది. లండన్‌లోని సిటీ సెయింట్ జార్జ్ విశ్వవిద్యాలయం, కోపెన్‌హాగన్‌లోని ఐటీ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ పరిశోధన నిర్వహించారు. ఏఐ సాధనాలకు వెన్నెముకగా నిలుస్తున్న లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (LLMs) ఒకదానితో ఒకటి ఎలా సంకర్షణ చెందుతాయో అర్థం చేసుకోవడమే ఈ అధ్యయనం ముఖ్య ఉద్దేశం. ఈ పరిశోధన వివరాలు 'సైన్స్ అడ్వాన్సెస్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. పరిశోధకులు ఈ ప్రయోగం కోసం ఒక 'నేమింగ్ గేమ్' (పేర్లు పెట్టే ఆట)ను ఉపయోగించారు. ఇందులో ఏఐ ఏజెంట్లు కొన్ని పేర్ల సముదాయం నుంచి పేర్లను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఒకే పేరును ఎంచుకున్నందుకు వాటికి ప్రోత్సాహకాలు లభిస్తాయి. కాలక్రమేణా, ఎలాంటి స్పష్టమైన మార్గదర్శకత్వం లేకుండానే ఏఐ ఏజెంట్లు ఉమ్మడి సంప్రదాయాలను, పక్షపాతాలను అభివృద్ధి చేసుకున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. మానవులు కూడా ఒకే రకమైన నిబంధనలకు కట్టుబడి ఉండే అలవాటును ఏఐ ఏజెంట్లు అనుకరించాయని పరిశోధకులు తెలిపారు. అంతేకాకుండా, ఓ చిన్న ఏఐ ఏజెంట్ల సమూహం, పెద్ద సమూహాన్ని ఒక నిర్దిష్ట సంప్రదాయం వైపు నడిపించడం కూడా సాధ్యమైందని, ఇలాంటి లక్షణం తరచుగా మానవ సమూహాల్లో కనిపిస్తుందని వారు పేర్కొన్నారు. "మా ఫలితాలు ఏఐ వ్యవస్థలు ఎలాంటి బాహ్య ప్రోగ్రామింగ్ లేకుండా స్వయంప్రతిపత్తితో సామాజిక సంప్రదాయాలను అభివృద్ధి చేసుకోగలవని చూపిస్తున్నాయి. మానవ విలువలు, సామాజిక లక్ష్యాలకు అనుగుణంగా ఏఐ వ్యవస్థలను రూపొందించడంలో ఈ ఫలితాలు ముఖ్యమైనవి" అని అధ్యయనం నొక్కి చెప్పింది. లామా-2-70బి-చాట్, లామా-3-70బి-ఇన్‌స్ట్రక్ట్, లామా-3.1-70బి-ఇన్‌స్ట్రక్ట్, క్లాడ్-3.5-సోనెట్ వంటి నాలుగు వేర్వేరు రకాల ఎల్ఎల్ఎంలను ఉపయోగించినప్పుడుఫలితాలు స్థిరంగా ఉన్నాయని పరిశోధకులు తెలిపారు.

**నైతికపరమైన అంశాలు, భవిష్యత్తు...** సమాజం నుంచి పొందిన పక్షపాతాలను వ్యాప్తి చేసే ఎల్ఎల్ఎం ఏఐల వల్ల తలెత్తే కొన్ని నైతిక ప్రమాదాలను ఎదుర్కోవడానికి తమ పరిశోధన ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఈ అధ్యయనం సీనియర్ రచయిత ఆండ్రియా బారోన్‌చెల్లి మాట్లాడుతూ, "ఈ అధ్యయనం ఏఐ భద్రతా పరిశోధనలకు కొత్త మార్గాలను తెరుస్తుంది. మనతో సంకర్షణ చెందడం ప్రారంభించిన ఈ కొత్త రకం ఏజెంట్ల ప్రభావం ఎంత లోతుగా ఉంటుందో ఇది చూపుతుంది. ఇవి మన భవిష్యత్తును కూడా ప్రభావితం చేస్తాయి" అని అన్నారు. "మనం ఏఐ కేవలం మాట్లాడటమే కాకుండా, మనలాగే చర్చలు జరిపే, సర్దుకుపోయే, కొన్నిసార్లు ఉమ్మడి ప్రవర్తనలపై విభేదించే ప్రపంచంలోకి ప్రవేశిస్తున్నాం" అని ఆయన జోడించారు.

## పేర్లు రాసిపెట్టుకోండి... సినిమా చూపిస్తాం:



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : వైసీపీ అధినేత జగన్ మరోసారి కూటమి ప్రభుత్వం, కొందరు అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అన్యాయాలకు పాల్పడే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, సమయం వచ్చినప్పుడు కచ్చితంగా "సినిమా చూపిస్తాం" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాక్షస ప్రభుత్వం నడుస్తోందని జగన్ ఆరోపించారు. "కలియుగంలో రాజకీయాలు చేయాలంటే భయం ఉండకూడదు. కేసులకు, జైళ్లకు బెదిరిపోకూడదు. అలా అయితేనే రాజకీయాలు చేయగలం. చంద్రబాబు చేస్తున్న రాజకీయాలు ఆ విధంగానే ఉన్నాయి" అని ఆయన వ్యాఖ్యానించారు. పోలీసులు కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తూ వైసీపీ వారిని అరెస్టులు చేస్తూ, టీడీపీ వారిని వదిలేస్తున్నారని విమర్శించారు. "మీరు ఏ పుస్తకంలోనైనా పేర్లు రాసుకోండి. అన్యాయం చేయాలనుకుంటే చేయమనండి, కొడతానంటే కొట్టమనండి. కానీ, మాకూ సమయం వస్తుంది. అప్పుడు అన్యాయాలు చేసిన ప్రతి ఒక్కరికీ సినిమా చూపిస్తాం. రిటైర్ అయిన వారిని కూడా లాక్కొచ్చి తీరుతాం. దేశం విడిచి పారిపోయినా రప్పిస్తాం" అని జగన్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. చంద్రబాబు నాటిన విత్తనాలే ప్రస్తుత పరిస్థితులకు కారణమని, మహిళలని కూడా చూడకుండా నెలల తరబడి జైళ్లలో పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక కేసులో బెయిల్ వస్తే, వెంటనే మరో కేసు నమోదు చేస్తున్నారని, వల్లభనేని వంశీ విషయంలోనూ ఇలాగే వ్యవహరించారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. దళితుడైన నందిగం సురేష్‌ను కూడా అన్యాయంగా నెలన్నరకు పైగా జైల్లో ఉంచి, బయటకు వచ్చిన తర్వాత మళ్లీ కేసు పెట్టి జైలుకు పంపారని మండిపడ్డారు. రేపు కచ్చితంగా వైసీపీ కార్యకర్తే నంబర్ వన్ అవుతాడని, కార్యకర్తలకు అండగా నిలబడతామని ఆయన భరోసా ఇచ్చారు. అన్యాయాలకు పాల్పడిన వారికి తగిన శాస్తి తప్పదని పునరుద్ఘాటించారు.

## తెలంగాణలో మళ్లీ వీఆర్ఏ, వీఆర్ఓ వ్యవస్థ



తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం మాట్లాడుతూ, దొర (కేసీఆర్)కు ఏమి ఆలోచన వచ్చిందో తెలియదు కానీ రాత్రికి రాత్రి వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థలను రద్దు చేశారని అన్నారు. రాష్ట్రంలో మళ్లీ వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థలను పునరుద్ధరిస్తామని ఆయన స్పష్టం చేశారు. జూన్ 2 నాటికి ప్రభుత్వం ద్వారా లైసెన్సులు ఇచ్చి ఆరు వేల మంది సర్వేయర్లను నియమిస్తామని తెలిపారు. నాలుగు గోడల మధ్య నలుగురు వ్యక్తులు కూర్చొని వారి స్వార్థం కోసం ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చారని, కేసీఆర్ పాలనను ఉద్దేశించి ఆయన విమర్శించారు. ధరణి వల్ల సామాన్య రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, అందుకే ఆ దొరలను ఫామ్ హౌస్‌కు పరిమితం చేశారని అన్నారు. ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని గత బీఆర్ఎస్ నాయకులు సంపాదించిన భూముల వివరాలు త్వరలో బయటపడతాయని ఆయన అన్నారు. భూ భారతికి భయపడి దోపిడీదారులు పారిపోయారని, అందుకే రియల్ ఎస్టేట్ రంగం కొద్దిగా మందగించిందని ఆయన అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు పథకాలను అమలు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. దేశంలోనే తెలంగాణను రోల్ మోడల్‌గా నిలబెట్టేందుకు కృషి చేస్తామని ఆయన అన్నారు. రెవెన్యూ వ్యవస్థలో చిన్న తప్పు కూడా జరగకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని మంత్రి కోరారు.

## హైదరాబాద్ ఏఐజీలో రోగులను పరామర్శించిన అందాలభామలు



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే మిస్ వరల్డ్ పోటీలకు సన్నాహాలు జరుగుతున్న వేళ, 2025 సంవత్సరానికి గాను పోటీ పడుతున్న పలువురు సుందరీమణులు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా వారు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. తమ పర్యటనలో భాగంగా, మిస్ వరల్డ్ 2025 పోటీదారులు శుక్రవారం నాడు హైదరాబాద్‌లోని ప్రముఖ ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో వారు ముచ్చటించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడిన అనంతరం, వారి ఆరోగ్య పరిస్థితి, వారికి అందుతున్న వైద్య సేవల గురించి అక్కడి వైద్యులను అడిగి వివరాలు సేకరించారు. మిస్ వరల్డ్ పోటీదారుల సందర్శన ఆసుపత్రిలోని రోగులకు, సిబ్బందికి కొంత ఉత్సాహాన్ని, మానసిక సాంత్వనను కలిగించింది. వారి పర్యటన సామాజిక సేవా దృక్పథాన్ని ప్రతిబింబించేలా సాగింది.

## వాళ్ల కంటే మిన్నగా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి: పవన్ కల్యాణ్



గన్నవరం, నేటి పత్రిక ప్రజావార్త : దేశ సరిహద్దుల్లో సైనికులు ఎంతటి అప్రమత్తతతో విధులు నిర్వర్తిస్తారో, రాష్ట్రంలో అంతర్గత భద్రత విషయంలో పోలీసులు కూడా అంతే జాగరూకతతో వ్యవహరించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాలు ఉగ్రవాదులకు సున్నితమైన లక్ష్యంగా మారాయని, ఈ నేపథ్యంలో రాష్ట్ర పోలీసు యంత్రాంగాన్ని, పరిపాలన సిబ్బందిని అప్రమత్తం చేస్తూ తాను లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. గన్నవరం విమానాశ్రయంలో జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో కోయంబత్తూరు, హైదరాబాద్‌లలో జరిగిన ఉగ్రవాద దాడులను ప్రస్తావిస్తూ, ఆ సంఘటనలు తలచుకుంటే ఇప్పటికీ గుండె తరుక్కుపోతుందని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. "రాష్ట్రంలో ఉగ్రవాదుల జాడలు కనిపించిన నేపథ్యంలో రాష్ట్ర పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని డీజీపీ గారిని లేఖ ద్వారా కోరాను. పాలనా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని ఉగ్రవాద జాడలున్న వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించాను" అని పవన్ వివరించారు. ముఖ్యంగా వలస వచ్చే వారి విషయంలో సరైన నిఘా ఉంచడం ద్వారా సంభవించబోయే ప్రమాదాలను నివారించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, తీర ప్రాంతంలో కూడా నిరంతర పర్యవేక్షణ, నిఘాను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. "గతంలో కాకినాడలో బయట వ్యక్తులు బోట్లలో వచ్చినట్లు కొన్ని వార్తలు వచ్చాయి. తీరంలో కొత్త వ్యక్తుల కదలికలు, వారి కార్యకలాపాలను నిశితంగా గమనించాలి. పోలీసులు అజాగ్రత్తగా ఉండకుండా అంతర్గత భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి" అని ఆయన హితవు పలికారు. ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో రాష్ట్రంలో కొన్ని ఉగ్రవాద జాడలు కనిపించినట్లు తెలిసిందని, ఈ పరిణామాల దృష్ట్యా నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. అంతర్గత భద్రత విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

## ముందుగానే వచ్చేస్తున్న నైరుతి రుతుపవనాలు...

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : దేశ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లని కబురు అందించింది. మరో నాలుగైదు రోజుల్లోనే నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు స్పష్టం చేశారు. తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వార్తతో ఉపశమనం లభించనుంది. భారత వాతావరణ విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం, నైరుతి రుతుపవనాలు ప్రస్తుతం శ్రీలంక, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. ఇవి చురుగ్గా కదులుతూ, రాబోయే నాలుగు లేదా ఐదు రోజుల్లో కేరళ రాష్ట్రంలో ప్రవేశించేందుకు అన్ని అనుకూల పరిస్థితులు ఉన్నాయని ఐఎండీ అధికారులు తెలిపారు. సాధారణంగా జూన్ మొదటి వారంలో కేరళను తాకే రుతుపవనాలు, ఈ ఏడాది మే నెలాఖరులోనే పలకరించనున్నాయి. రుతుపవనాల కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నామని, ఇవి జులై 8వ తేదీ నాటికి దేశవ్యాప్తంగా విస్తరిస్తాయని అంచనా వేస్తున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. ఈ ఏడాది రుతుపవనాల ఆగమనం ముందుగానే ఉండటంతో, వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తొలకరి వర్షాలు సరైన సమయంలో కురిస్తే పంటలకు మేలు జరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వం ఇచ్చే కుల ధృవీకరణ పత్రాల్లో మరియు గ్రామ సచివాలయ ఎంట్రీల్లో "ఓసీ వైశ్య" ని ఆర్యవైశ్య గా మార్చండి

*- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ వినతి*



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : గవర్నమెంటు వారు విధి, విధానాల ప్రకారం రాష్ట్రంలో ఇంతకుముందు జరిగిన సర్వేలు / కుల గణనలను బట్టి ఉన్న ఆర్య వైశ్యులను వైశ్య/శెట్టి / గుప్త / కోమటి / లాగా వివిధ వర్గాల వారుగా విభజించి చూపడం వలన రాష్ట్రంలో గవర్నమెంటు వారు నిర్వహించే ఆన్ లైన్ వెబ్ సైట్ లలో, యాప్ లలో కూడా ఆర్య వైశ్యులను వివిధ వర్గాలుగా చూపించడం జరుగుతోంది. ముఖ్యంగా, మండల రెవెన్యూ అధికారులు ఇచ్చే కుల ధృవీకరణ పత్రాలలో కూడా " ఒ.సి. వైశ్య " అని మాత్రమే వస్తుంది. అందువలన ఆర్యవైశ్య వర్గాల వారు ఒకవిధమైన తికమకకు గురికాబడుచున్నారు. కావున గవర్నమెంటు వారి ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం ఉన్నవారిని, భవిష్యత్తులో జరగబోయే " కుల గణన" విషయంలో గాని యాప్లలో గాని, ఆన్ లైన్ సైట్లలోగాని ఒకే వర్గంగా అదీ " ఆర్య వైశ్య " అనే విధంగానే ఉండేటట్లు చూడవలసినదిగా కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారికి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ విన్నవించుకున్నారు.

## ఆక్యుప్రెషర్ ఆక్యుపంక్చర్ గుర్తింపుకు కృషి...: ఎమ్మెల్యే బోడె ప్రసాద్



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : నా నియోజకవర్గంలో నిర్వహించబడుతున్న ఆక్యుప్రెషర్ ఆక్యుపంక్చర్ వైద్యాన్ని కేంద్ర ప్రభుత్వ గుర్తింపు కొరకు మాజీ లోక్ సభ సభ్యుడు కొనకళ్ళ నారాయణతో కలిసి కృషి చేసినట్లు తెలిపారు. 10 సంవత్సరాల కాలం పట్టిన పెన్నంటి ఉండి,నిర్విరామంగా మా సహకారం పొంది కేంద్ర ప్రభుత్వ గుర్తింపుకు ఈ ప్రాంతంలో వైద్య వృద్ధి చెందటానికి పాటుపడిన మాకాల సత్యనారాయణ ను అభినందిస్తున్నాను అని తెలిపారు. అంతర్జాతీయ యోగ దినోత్సవాలలో భాగంగా మోదీ ఫిట్నెస్ మంత్ర అవగాహన బ్రోచర్ను ఆవిష్కరించి,తన సహకారం అందిస్తానని తెలిపారు. యోగా సేవా సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ మాట్లాడుతూ పెనమలూరు ఎమ్మెల్యే బోడ బోడే ప్రసాద్, మచిలీపట్నం మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ,అమలాపురం మాజీ ఎంపీ పండుల రవీంద్ర బాబు అందించిన సహకారమే ఈనాడు కేంద్ర ప్రభుత్వ ఆక్యుపంక్చర్ ను ప్రత్యేక విధాన చికిత్సగా గుర్తింపు రావడానికి కారణమని అలా సహకారం అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.అలాగే 20 25 అంతర్జాతీయ యోగా దినోత్సవం జయప్రదం చేయటానికి సహకారం అందిస్తున్న అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## అర్థం లేని చర్చలు మాని ఇలా చేయండి... నటి రేణుదేశాయ్ పిలుపు

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : సామాజిక అంశాలపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడించే నటి రేణు దేశాయ్. తాజాగా మరో కీలకమైన విజ్ఞప్తితో ముందుకొచ్చారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చైనా ఉత్పత్తుల వాడకాన్ని మానేయాలని ప్రజలను కోరారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఆమె చేసిన ఓ పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. దేశ భద్రత, కుటుంబ శ్రేయస్సు నిజంగా మనకు ముఖ్యమైతే చైనాలో తయారైన చిన్న వస్తువును కూడా కొనడం ఆపేయాలని రేణు దేశాయ్ తన పోస్ట్లో పేర్కొన్నారు. "ఏదైనా వస్తువు కొనే ముందు దాని లేబుల్ను ఇప్పటినుంచైనా చదవడం ప్రారంభించండి. చైనా ఉత్పత్తులను కొనడం మానేశామని ఆలోచనే తెలిసేలా చేయండి" అని సూచించారు. తాను కూడా ఇప్పటివరకు చైనాలో తయారైన వస్తువులను కొన్నప్పటికీ, ఇటీవల ప్రతి వస్తువుపై ఉండే లేబుల్ను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నానని తెలిపారు. ఒకవేళ అది చైనాలో తయారైనట్లు తేలితే, దాన్ని కొనకుండా ఉండటానికి ప్రయత్నిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. ఇది ఒక్క రోజులో అయ్యే పని కాదని, సుదీర్ఘమైన ప్రక్రియ అని అంగీకరిస్తూనే, కనీసం ఇప్పటినుంచైనా ఈ మార్పును ప్రారంభిద్దామని రేణు పిలుపునిచ్చారు. "మీరు కొనాలనుకునే వస్తువు ఎక్కడ తయారైందో తెలుసుకోండి. మన దేశాన్ని ఆదరిద్దాం" అని ఆమె రాసుకొచ్చారు. ఈ సందేశాన్ని ప్రతిఒక్కరూ షేర్ చేయాలని కోరుతూ "మనమందరం ఎక్కడో ఒకచోట దీన్ని ప్రారంభించాలి. మన దేశానికి, మన మాతృభూమికి మనం మద్దతు ఇవ్వకపోతే ఇంకెవరు ఇస్తారు? ఈ విషయాన్ని మీ కుటుంబ సభ్యులకు తెలియజేయండి. అర్థం లేని టీవీ రియాలిటీ షోల గురించి, అనవసరమైన రూమర్ల గురించి మాట్లాడుకోవడం కంటే, మన దేశ పరిస్థితి గురించి చర్చించుకోవడం మొదలుపెడదాం" అని రేణు దేశాయ్ పేర్కొన్నారు.

## గ్రామ రెవెన్యూ అధికారుల కేడర్ స్ట్రెంత్ తగ్గకుండా చర్యలు తీసుకోవాలి...

*: భూపతిరాజు రవీంద్ర రాజు*

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్ ని వారి క్యాంపు కార్యాలయంలో కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం. రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు. ఈ సందర్భంలో చీఫ్ సెక్రటరీ తో ప్రస్తుతం రాష్ట్రంలో రేషనలైజేషన్ పేరుతో



జరుగుతున్న క్లస్టర్ విధానంలో లోపాలను చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో గ్రామ సచివాలయాలను తీసుకు రావడం జరిగింది. ఆ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయాలను ఇప్పుడు జనాభా ప్రాతిపదికన రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్ చేయడం జరుగుతుంది. దీనివల్ల భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. ఎందుకంటే మారెవెన్యూ డిపార్ట్మెంట్ కు సంబంధించి భూ సంబంధిత విషయాలు గ్రామాల్లో అనేక సమస్యలు ఉంటాయి. ఇప్పుడున్న సచివాలయ వ్యవస్థలో ఒక సచివాలయానికి ఒక విఆర్ఓ పనిచేస్తుంటేనే తీవ్ర పని ఒత్తిడికి గురవడం జరుగుతుంది. అటువంటిది క్లస్టర్ విధానం వల్ల రెండు సచివాలయలను కలిపి కేవలం జనాభా ప్రాతిపదికన మాత్రమే చూస్తున్నారు, గాని భూ విస్తీర్ణం గురించి, ఎవరు ఆలోచించకుండా, రెవెన్యూ డిపార్ట్మెంట్ కు సంబంధించి మండలాల్లో తా హసిల్దార్లను కూడా సంప్రదించకుండా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు చేస్తున్న ఈ అసంబద్ధత క్లస్టర్ విధానం వల్ల అనేక భూ సమస్యలు పరిష్కారం కాక రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులకు గురవడం జరుగుతుంది. దానివల్ల ప్రభుత్వానికి తీవ్ర నష్టం జరుగుతుంది. అందువల్ల ప్రస్తుతం ఉన్న సచివాలయ వ్యవస్థలో ఒక సచివాలయానికి ఒక విఆర్వో ఉండేలాగా నిర్ణయం తీసుకోవాలని తెలియజేయడం జరిగింది. అలాగే అర్హులైన గ్రామ రెవెన్యూ అధికారులందరికీ సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్లు కల్పించాలని కోరడం జరిగింది. గ్రేడ్ 2 వీఆర్వోలుకు వెంటనే గ్రేడ్ 1 ప్రమోషన్లు కల్పించాలని కోరడం జరిగింది. ఈ క్లస్టర్ విధానం వల్ల సుమారు 7500 మంది విఆర్వోలు కేడర్ స్ట్రెంత్ తగ్గిపోతే భవిష్యత్తులో ప్రస్తుతం పని చేస్తున్న వీఆర్వోలకు తీవ్ర పని ఒత్తిడి పెరుగుతుంది మరియు అర్హులైన వీఆర్ఏలకు భవిష్యత్తులో విఆర్వోలుగా ప్రమోషన్లు రాక చాలా ఇబ్బందులకు గురి అవుతారు, అందువల్ల మా గ్రామ రెవెన్యూ అధికారుల కేడర్ స్ట్రెంత్ తగ్గకుండా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. చీఫ్ సెక్రటరీ సానుకూలంగా స్పందించి అధికారులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

## అమ్మ మీద నాన్న మీద అలిగినట్టు పార్టీ మీద అలగండి.. కానీ అమ్మ లాంటి పార్టీని మరచిపోవద్దు: మంత్రి లోకేశ్



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : టీడీపీ పార్టీ కార్యకర్తలకు మంత్రి నారా లోకేశ్ తాజాగా కీలక సూచనలు చేశారు. అందరూ సమన్వయంతో పనులు చేసుకోవాలని సూచించారు. గ్రామ స్థాయిలో కార్యకర్తలు యూనిటీగా ఉండాలని తెలిపారు. అమ్మ మీద నాన్న మీద అలిగినట్టు పార్టీ మీద అలగండి. కానీ అమ్మ లాంటి పార్టీని మరచిపోవద్దు. దయచేసి మూడవ వ్యక్తి చెప్పింది నమ్మవద్దని లోకేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు వివిధ స్థాయిలలో పనులు ఎలా చేసుకోవాలో తెలుపుతూ ఆయన ఒక నోట్ విడుదల చేశారు.

1) దయచేసి మీరు గ్రామంలో యూనిటీగా ఉండండి, 2) గ్రామస్థాయిలో పని జరగపోతే మండల పార్టీ నాయకుల ద్వారా పనులు చేసుకోండి, 3) అప్పటికి అవ్వకపోతే ఎమ్మెల్యే (%మీరూ%) దగ్గరకి వెళ్లండి, 4) అప్పటికి అవ్వకపోతే మీ ఇంచార్జ్ మినిస్టర్ దగ్గరికి వెళ్లండి, 5) అప్పటికి అవ్వకపోతే టీడీపీ సెంట్రల్ ఆఫీస్ మంగళగిరికి వచ్చి ఒక అర్జీ ఇవ్వండి. "మన ఇంట్లో ఉంటే పనులు అవ్వవు. దయచేసి మీ సొంత పనులు అడగండి. మీకు సమస్యలు లేకపోతే అప్పుడూ మిగతావారి పనులు తీసుకురండి. ఎక్కడ నిరుత్సాహ పడవద్దు. అమ్మ మీద నాన్న మీద అలిగినట్టు పార్టీ మీద అలగండి. కానీ అమ్మ లాంటి పార్టీని మరచిపోవద్దు. దయచేసి మూడవ వ్యక్తి చెప్పింది నమ్మవద్దు. మీరు లైవ్ లో విన్నవి నమ్మండి. మన ఎమ్మెల్యే వైసీపీ వాళ్లకి చేస్తున్నాడు అంటా? లోకేశ్ టైమ్ ఇవ్వడం లేదు అంటా? బాబు గారు అసలు కలవడం లేదు అంటా? ఇలాంటి పుకార్లు నమ్మవద్దు. మేము మనషులమే కదా! కొన్ని తప్పులు చేయవచ్చు. దయచేసి మీరు చెప్పండి" అని మంత్రి లోకేశ్ కార్యకర్తలను కోరారు.

## శ్రీ అభయాంజనేయస్వామివారి దేవస్థానంలో హనుమత్ జయంతి వేడుకలు



దుగ్గిరాల, నేటి పత్రిక ప్రజావార్త : గుంటూరు జిల్లా, దుగ్గిరాలనందు శ్రీ అభయాంజనేయస్వామివారి దేవస్థానం నందు హనుమంతుని జన్మదినోత్స వాన్ని పురస్కరించుకుని హనుమత్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. గురువారం దుగ్గిరాల నుండి విజయవాడ వెళ్ళే మెయిన్‌రోడ్డులో శ్రీ అభయాంజనేయస్వామివారి 42 అడుగుల భారీ విగ్రహం ఆలయం నందు అంగరంగ వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ అభయాంజనేయా ట్రస్ట్ అధ్యక్షులు జూటూరి శ్రీను మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్టాపన తరువాత మొట్టమొదటి హనుమత్ జయంతి అని ఈ దైవ కార్యక్రమాన్ని అందరి సహకారంతో దిగ్విజయంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తు న్నానని, అందరికీ స్వామివారి కృపాకటాక్షాలు కలగాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. ఈరోజు 3 వేల మందికి అన్నప్రసాద వితరణ కావించామన్నారు. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చేసి భక్తులకు అన్ని విధాలు సౌకర్యవంతమైన విధంగా తీర్చిదిద్దే ఆలోచనలో వున్నట్లు తెలిపారు. దేవాలయంలోని శ్రీ అభయాంజనేయ స్వామికి అర్చకుడు వినయ్‌కుమార్‌శర్మ పూజాకార్యక్రమాలు, అభిషేకం, అలంకారం నిర్వహించగా పలువురు హనుమాన్‌చాలీసా పారా యణం, వివిధ రకాలైన పూలతో, తమలపాకులు, మామిడిపండ్లతో ప్రత్యేక పూజలు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించు కుని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో తాడిశెట్టి వెంకటేశ్వరరావు, తాడిశెట్టి శ్రీను, ముద్రబోయిన జగన్, పుసుపులేటి గణేష్, వెంకట్రావు, కటారి సురేష్, కె.వెంకటేశ్వరరావు, పి.లక్ష్మణరావు, ముద్రబోయిన గోపీ, కఠారి సురేష్, కూరపాటి ప్రవీణ్, కమిటీ సభ్యులు, స్థానికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కేన్స్‌లో తళుక్కుమన్న భారత యువ తార నితాన్షి



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : 'లాపతా లేడీస్' సినిమాతో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చిన యువ నటి నితాన్షి గోయల్, ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై తనదైన ముద్ర వేసింది. ప్రతిష్ఠాత్మక కేన్స్ చలనచిత్రోత్సవంలో ఆమె తొలిసారి అడుగుపెట్టి, అందరి దృష్టినీ ఆకర్షించింది. ముఖ్యంగా, భారతీయ సినిమా దిగ్గజాలకు ఆమె అర్పించిన వినూత్న నివాళి ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది విడుదలైన విజయవంతమైన చిత్రం 'లాపతా లేడీస్'లో 'ఫూల్' పాత్రలో అద్భుతమైన నటనతో ప్రేక్షకుల మనసు దోచుకున్న 17 ఏళ్ల నితాన్షి, కేన్స్ రెడ్ కార్పెట్‌పై ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒక సందర్భంలో నలుపు మరియు బంగారు వర్ణాల గౌనులో తళుక్కుమనగా, మరో సందర్భంలో పూసలు, ముత్యాలు పొదిగిన ప్రీ-డ్రేప్డ్ చీరలో మెరిసింది. ఈ చీరకు మల్టీలేయర్డ్ 3%ణ% వర్క్, భారీ పల్లూ అదనపు ఆకర్షణను తీసుకువచ్చాయి. దీనికి జతగా ముత్యాలు పొదిగిన స్ట్రాపీ బ్లౌజ్ ధరించింది. అయితే, అన్నింటికన్నా నితాన్షి హెయిర్‌స్టైల్ ప్రత్యేకంగా నిలిచింది. తన ముత్యాల జడలో అలనాటి బాలీవుడ్ తారలైన మధుబాల, నర్గీస్, మీనా కుమారి, నూతన్, వహీదా రెహ్మాన్, ఆశా పరేఖ్, వైజయంతిమాల, హేమ మాలిని, రేఖ, శ్రీదేవి వంటి పలువురు దిగ్గజ నటీమణుల సూక్ష్మ ఛాయాచిత్రాలతో కూడిన కస్టమ్-మేడ్ హెయిర్ యాక్సెసరీని ధరించింది. హిందీ సినిమాపై చెరగని ముద్ర వేసిన ఈ తారలపై తనకున్న ప్రేమను, గౌరవాన్ని ఈ విధంగా చాటుకోవడం అందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రత్యేకమైన డ్రెస్సులు, హెయిర్‌స్టైల్ ఎంపికకు తనకు పెద్దగా సమయం పట్టలేదని నితాన్షి చెప్పింది. తన ఫ్యాషన్ ఐకాన్ ఐశ్వర్య రాయ్ బచ్చన్ అని, కేన్స్‌లో అలియా భట్ అంతటి స్థాయిలో కనిపించాలని తాను కోరుకున్నట్లు ఆమె వెల్లడించింది.

**యువనటి ఖాతాలో మరిన్ని రికార్డులు..** లోరియల్ ప్యారిస్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ కేన్స్ రెడ్ కార్పెట్‌పై నడిచిన అతి పిన్న వయస్కురాలైన భారతీయ నటిగా నితాన్షి గోయల్ నిలిచింది. అంతేకాకుండా, 'లాపతా లేడీస్' చిత్రానికి గాను ఉత్తమ నటిగా అవార్డు అందుకున్న అతి పిన్న వయస్కురాలిగా కూడా ఆమె రికార్డు సృష్టించింది. సోషల్ మీడియా వేదిక ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్లను కలిగిన అతి పిన్న వయస్కురాలైన నటీమణులలో నితాన్షి ఒకరు కావడం విశేషం. కేన్స్‌లో ఆమె ప్రదర్శించిన హుందాతనం, సీనియర్ నటీమణుల పట్ల చూపిన గౌరవం ప్రశంసలు అందుకుంటున్నాయి.

## పవన్ కళ్యాణ్ 'హరిహర వీరమల్లు' విడుదల తేదీ ఖరారు



సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'హరిహర వీరమల్లు' విడుదల తేదీ ఖరారైంది. ఈ భారీ బడ్జెట్ సినిమాను జూన్ 12న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురా నున్నట్లు చిత్ర బృందం నేడు అధికారికంగా ప్రకటించింది. పవన్ కళ్యాణ్ ఈ చిత్రంలో వీరమల్లు అనే యోధుడి పాత్రలో కనిపించనున్నారు. పవన్ నుంచి చాలాకాలం తర్వాత ఓ సినిమా వస్తుండడంతో, హరిహర వీరమల్లు సినిమాపై అంచనాలు అమాంతం పెరిగాయి. ప్రస్తుతం 'హరిహర వీరమల్లు' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీఎఫ్ఎక్స్, సౌండ్ డిజైనింగ్, డబ్బింగ్ వంటి కీలక పనులను చిత్ర యూనిట్ వేగంగా పూర్తి చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా పాటలు సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుని, సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. ఈ ఉత్సాహాన్ని కొనసాగిస్తూ, త్వరలోనే సినిమా మూడో సింగిల్‌తో పాటు అధికారిక ట్రైలర్‌ను కూడా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ట్రైలర్ విడుదలతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగి, విడుదల నాటికి ఆకాశాన్నంటడం ఖాయమని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఆలస్యమైనప్పటికీ, దర్శకుడు ఎ.ఎం. జ్యోతి కృష్ణ ఈ ప్రాజెక్టు బాధ్యతలు చేపట్టి, సినిమాను అనుకున్న విధంగా తీర్చిదిద్దడంలో అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అందిస్తున్న సంగీతం, మనోజ్ పరమహంస సినిమాటోగ్రఫీ, తోట తరణి ప్రొడక్షన్ డిజైన్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్‌తో పాటు బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ మొఘల్ చక్రవర్తి పాత్రలో ప్రతినాయకుడిగా నటిస్తుండగా, నిధి అగర్వాల్ కథానాయికగా కనిపించనుంది. సీనియర్ నటులు సత్యరాజ్, జిష్షు సేన్‌గుప్తా వంటి వారు కీలక పాత్రల్లో నటిస్తూ సినిమాకు మరింత బలాన్ని చేకూరుస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఎ.ఎం. రత్నం సమర్పిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్న 'హరిహర వీరమల్లు' చిత్రం, బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడానికి సిద్ధమవుతోంది.

## రేషనలైజేషన్ ద్వారా వీఆర్వోలు, వీఎస్‌లు, వీఆర్ఎలకు తీవ్ర అన్యాయం...: భూపతిరాజు రవీంద్రరాజు




విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : రేషనలైజేషన్ ద్వారా గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్ఓ), గ్రామ సర్వేయర్ (వీఎస్), గ్రామ రెవెన్యూ సహాయకులకు (వీఆర్ఎ) తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు అన్నారు. గురువారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన పాత్రికే యుల సమావేశంలో భూపతిరాజు రవీంద్రరాజు మాట్లాడుతూ... ఆయా శాఖల ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా సిబ్బందిని తగ్గిస్తూ జీఎస్‌డబ్ల్యూఎస్ జీవో 4 జారీ చేయడం దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాలను జనాభా ప్రాతిపదికన క్లస్టర్ విధానం తీసుకొచ్చి రెండు, మూడు సచివాలయా లను కలిపి ఒక క్లస్టర్ ఏర్పాటు చేస్తూ, ఒక సచివాలయానికి ఒక వీఆర్ఎను లేదా ఒక విలేజ్ సర్వేయర్‌ను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ క్లస్టర్ విధానం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7,500 మంది వీఆర్వో, 4,722 మంది వీఎస్‌లను తగ్గిపోతున్నట్టు ఏ సచివాలయంలోను చూపలేద న్నారు. దీనివలన పదోన్నతులకు అర్హులైన వీఆర్ఎలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అర్హులైన వీఆర్వోలకు పదోన్నతులు కల్పించాలన్నారు. రెవిన్యూ సమస్యల పరిష్కారాలను సర్వేయర్‌లపై రుద్దడం చాలా దారుణమ న్నారు. కారణం చెప్పకుండా సిబ్బందిని తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడంతో వీరంతా ఆందోళన చెందుతున్నారన్నారు. వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్, ఆర్ఐలుగా ఉద్యోగోన్నతులు కల్పించడం ద్వారా ప్రభుత్వానికి ఎటువంటి ఆర్థిక భారం ఉండదన్నారు. ప్రతి రెవెన్యూ విలేజ్‌కు ఒక వీఆర్వోను కొనసాగిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు, రాష్ట్ర కోశాధికారి మౌళి బాషా, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్య కులు లక్ష్మీనారాయణ, ప్రసన్నకుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

## చరిత్ర సృష్టించిన నీరజ్ చోప్రా..




స్పోర్ట్స్ డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : భారత గోల్డెన్ బాయ్ నీరజ్ చోప్రా కొత్త చరిత్ర లిఖించాడు. జావెలిన్‌త్రోలో సరికొత్త రికార్డుతో నీరజ్ దోహా డైమండ్ లీగ్‌లో కదంతొక్కాడు. శుక్రవారం దోహా వేదికగా మొదలైన ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్‌లో నీరజ్ తన కెరీర్‌లోనే తొలిసారి 90.23 మీటర్ల మార్క్ అందుకున్నాడు. గత కొన్నేళ్లుగా ఊరిస్తున్న 90 మీటర్ల దూరాన్ని ఎట్టకేలకు అందుకున్నాడు. ఈ క్రమంలో గతంలో తన పేరిటే ఉన్న జాతీయ రికార్డు (89.94మీ)ను చోప్రా దాటేశాడు. ఇక, నిన్నటి పోటీలో తన మొదటి ప్రయత్నంలోనే బల్లెంను 88.44 మీటర్ల దూరం విసిరిన ఈ స్టార్ అథ్లెట్... రెండో ప్రయత్నంలో ఫౌల్ అయ్యాడు. అయితే, మూడో ప్రయత్నంలో అద్భుతం చేసి చూపించాడు. ఇన్నాళ్లుగా అందినట్లే అంది దూరమవుతున్న 90 మీటర్ల దూరాన్ని ఒడిసిపట్టుకున్నాడు. అయితే, అదే జోరును కొనసాగించడంలో చోప్రా ఒకింత విఫలమయ్యాడు. నాలుగో ప్రయత్నంలో 80.56 మీటర్లు విసిరిన నీరజ్ ఐదోసారి మళ్లీ ఫౌల్ అయ్యాడు. ఆఖరిదైన ఆరో త్రోలో నీరజ్ 88.20 మీటర్లకే పరిమితమయ్యాడు. ఇదే అదనుగా అప్పటి వరకు చోప్రా దరిదాపుల్లోనే ఉన్న జర్మనీకి చెందిన అథ్లెట్ జులియన్ వెబర్ ఆరో ప్రయత్నంలో బల్లెంను ఏకంగా 91.06 మీటర్లు విసిరాడు. దీంతో టాప్‌లోకి దూసుకొచ్చాడు. కెరీర్‌లో తొలిసారి అత్యుత్తమ మార్క్ అందుకున్న వెబర్... నీరజ్‌ను దాటేసి విజేతగా నిలిచాడు. వీరిద్దరి తర్వాత అండర్సన్ పీటర్స్ 85.64 మీటర్లతో మూడో స్థానం కైవసం చేసుకున్నాడు.

నీరజ్ చోప్రా కెరీర్‌లో టాప్-5 త్రోలు ఇవే.. 90.23మీలి (దోహా డైమండ్ లీగ్ 2025), 89.94మీ (స్టాక్‌హోమ్ డైమండ్ లీగ్ 2022), 89.49మీ (లౌసాన్ డైమండ్ లీగ్ 2024), 89.45 మీ (పారిస్ ఒలింపిక్స్ 2024 - ఫైనల్), 89.34 మీ (పారిస్ ఒలింపిక్స్ 2024 - క్వాలిఫైయర్)

## 28 కోట్లు పెడితే 200 కోట్లకి పైగా తెచ్చిందే!



సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : మలయాళ క్రైమ్ థ్రిల్లర్ సినిమాలను ఇష్టపడేవారి సంఖ్య చాలా ఎక్కువ. సహజత్వానికి దగ్గరగా ఉండే ఈ క్రైమ్ థ్రిల్లర్ సినిమాలను చూడటానికి అంతా ఎంతో ఆసక్తిని కనబరుస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలోనే మోహన్ లాల్ నుంచి ఒక క్రైమ్ థ్రిల్లర్ థియేటర్లకు వచ్చింది .. ఆ సినిమా పేరే 'తుడరుమ్'. రెంజిత్ నిర్మించిన ఈ సినిమాకి, తరుణ్ మూర్తి దర్శకత్వం వహించాడు. ఏప్రిల్ 24వ తేదీన ఈ సినిమాను భారీస్థాయిలో విడుదల చేశారు. మోహన్ లాల్ సరసన 'శోభన' నటించిన ఈ సినిమాకి, మిక్కీ జె మేయర్ సంగీతాన్ని సమకూర్చాడు. మోహన్ లాల్ కి గల క్రేజ్ గురించి .. మార్కెట్ గురించి తెలియంది కాదు. అయినా కథకు తగినట్టుగా ఖర్చు చేస్తూ, కేవలం 28 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమాను నిర్మించారు. అలాంటి ఈ సినిమా కేరళలోనే 100 కోట్లకి పైగా వసూళ్లను రాబట్టింది. ప్రపంచవ్యాప్తంగా 200 కోట్లకి పైగా వసూళ్లను సాధించింది. మలయాళ ఇండస్ట్రీలో తక్కువ సమయంలో ఈ స్థాయి వసూళ్లను రాబట్టిన మూడో సినిమాగా ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఆక్రమించింది. అలాంటి ఈ సినిమా, జూన్ లో 'హాట్ స్టార్' ద్వారా స్ట్రీమింగ్ కానున్నట్టు తెలుస్తోంది. కథ విషయానికి వస్తే .. హీరో ఒక ట్యాక్సీ డ్రైవర్. నీతి - నిజాయితీతో కూడిన సింపుల్ లైఫ్ అతనిది. ఆయనకు ఇద్దరు పిల్లలు. హీరో కొడుకు తన తండ్రి కారులో స్నేహితులతో కలిసి సరదాగా 'చెన్నై' కి వెళతాడు. ఆ కారులో గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్నారని పోలీసులు కారు సీజ్ చేస్తారు. ఆ సంఘటనతో హీరో లైఫ్ ఎలాంటి ప్రాబ్లమ్స్ లో పడుతుందనేది కథ.




## జ్ఞాపకశక్తి కోసం జపనీస్ చిట్కాలు... అందరూ ట్రై చేయొచ్చు!

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య మతిమరుపు. ముఖ్యమైన విషయాలను కూడా క్షణాల్లో మర్చిపోవడం సర్వసాధారణమైపోయింది. అయితే, కొన్ని ప్రత్యేకమైన పద్ధతులను పాటిస్తే జ్ఞాపకశక్తిని గణనీయంగా మెరుగుపరుచుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా, జపాన్ దేశస్థులు అనుసరించే కొన్ని సంప్రదాయ, ఆధునిక పద్ధతులు జ్ఞాపకశక్తిని పెంపొందించడంలో అద్భుతంగా పనిచేస్తాయని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అవేంటో వివరంగా తెలుసుకుందాం..

జపనీయులు తరతరాలుగా పాటిస్తున్న, ఆధునిక పరిశోధనలు కూడా సమర్థించిన కొన్ని ప్రభావవంతమైన జ్ఞాపకశక్తి పద్ధతులు ఉన్నాయి. ఇవి ఏకాగ్రతను పెంచడమే కాకుండా, సమాచారాన్ని ఎక్కువ కాలం గుర్తుంచుకోవడానికి, విషయాన్ని సులభంగా అర్థం చేసుకోవడానికి దోహదపడతాయి.

1. మైండ్ మ్యాపింగ్ (Mind Mapping): ఇది ఒక దృశ్యరూపక అభ్యాస పద్ధతి. దీనిలో ఒక ప్రధాన అంశాన్ని మధ్యలో ఉంచి, దానికి సంబంధించిన ఇతర ఆలోచనలు, భావనలను కొమ్మలుగా విస్తరిస్తూ చిత్రిస్తారు. ప్రాజెక్టుల ప్రణాళిక, ఆలోచనల క్రమబద్ధీకరణ, క్లిష్టమైన విషయాలను అర్థం చేసుకోవడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. దీనివల్ల విషయాలను దృశ్యరూపంలో చూడటం, సమాచారాన్ని సులువుగా ప్రాసెస్ చేయడం, ఆలోచనల మధ్య సంబంధాన్ని గుర్తించడం తేలికవుతుంది.

2. నిమోనిక్స్ (Mnemonics): క్లిష్టమైన సమాచారాన్ని గుర్తుంచుకోవడానికి ఉపయోగపడే స్మృతి సహాయకాలు ఇవి. సులభంగా గుర్తుండే పదబంధాలు, సంకేతాల ద్వారా సంక్లిష్టమైన డేటాను గుర్తుంచుకోవచ్చు. జపాన్‌లో ఈ పద్ధతిని విరివిగా ఉపయోగిస్తారు. దీనివల్ల ఎంతటి కష్టమైన సమాచారమైనా అవసరమైనప్పుడు సులభంగా గుర్తుకు తెచ్చుకోవచ్చు.

3. స్పేస్డ్ రిపిటీషన్ (Spaced Repetition): నేర్చుకున్న సమాచారాన్ని ఒకేసారి కాకుండా, క్రమంగా పెరుగుతున్న కాల వ్యవధుల్లో పునఃసమీక్షించడం ఈ పద్ధతిలోని కీలకాంశం. ఇలా చేయడం వల్ల సమాచారం మెదడులో మరింత బలంగా నాటుకుపోతుంది. వైద్య విద్య, పరీక్షల తయారీ వంటి వాటిలో ఈ పద్ధతిని ఎక్కువగా ఉపయోగిస్తారు. అంకి, క్విజ్‌లెట్ వంటి సాధనాలు ఈ ప్రక్రియను ఆటోమేట్ చేసి, వ్యక్తిగతీకరించిన సమీక్ష షెడ్యూళ్లను అందిస్తాయి.

4. విజువలైజేషన్ (Visualization): మానసిక చిత్రాలను సృష్టించడం ద్వారా విషయాలను గుర్తుంచుకునే ప్రక్రియ ఇది. క్లిష్టమైన లేదా నైరూప్య సమాచారాన్ని స్పష్టమైన మానసిక చిత్రాలుగా మార్చుకోవడం వల్ల ఎక్కువ ఇంద్రియాలు పాల్గొని, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఉదాహరణకు, ఒక చారిత్రక సంఘటనను గుర్తుంచుకోవాలంటే, ఆ సన్నివేశాన్ని రంగులు, వ్యక్తులు, కదలికలతో vividoగా ఊహించుకోవచ్చు. ఇది మెదడులోని నరాల మార్గాలను మెరుగుపరిచి, కొత్త సమాచారాన్ని పాత జ్ఞాపకాలతో అనుసంధానించడానికి సహాయపడుతుంది.

5. మెమరీ ప్యాలెస్ (Loci Method): ఇది శతాబ్దాలుగా వాడుకలో ఉన్న అత్యంత ప్రభావవంతమైన పద్ధతుల్లో ఒకటి. దీనిలో, బాగా తెలిసిన ప్రదేశంలోని (ఇల్లు లేదా నడిచే దారి వంటివి) నిర్దిష్ట స్థానాలకు సమాచారాన్ని జోడించి గుర్తుంచుకుంటారు. సమాచారం అవసరమైనప్పుడు, ఆ ప్రదేశంలో మానసికంగా నడుస్తూ, ప్రతిచోటా నిక్షిప్తం చేసిన డేటాను తిరిగి పొందుతారు. ప్రసంగాలు, జాబితాలు లేదా సంక్లిష్టమైన క్రమాలను గుర్తుంచుకోవడానికి ఇది చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది.

6. చంకింగ్ (Chunking): పెద్ద మొత్తంలో ఉన్న సమాచారాన్ని చిన్న, నిర్వహించదగిన భాగాలుగా విభజించడమే చంకింగ్. మెదడు స్వల్పకాలిక జ్ఞాపకశక్తి పరిమితిని దృష్టిలో ఉంచుకుని, సమాచారాన్ని సమూహాలుగా చేయడం ద్వారా మానసిక భారాన్ని తగ్గిస్తుంది. ముఖ్యమైన నమూనాలను గుర్తించడం ద్వారా, వ్యక్తులు సమాచారాన్ని బాగా ప్రాసెస్ చేయడానికి, నిల్వ చేయడానికి ఈ పద్ధతి సహాయపడుతుంది. భాషా అభ్యాసం, సమస్యల పరిష్కారంలో దీన్ని తరచుగా ఉపయోగిస్తారు.

7. కేకగోయ్ (Kakegoe - జపించడం లేదా నినాదాలు చేయడం): జపనీస్ సంస్కృతిలో, ముఖ్యంగా యుద్ధ కళలు, కాలిగ్రఫీ, సంగీతం వంటి రంగాలలో సమాచారాన్ని త్వరగా గుర్తుంచుకోవడానికి లయబద్ధంగా బిగ్గరగా పునరావృతం చేయడం ఒక సంప్రదాయ పద్ధతి. ఇలా చేయడం వల్ల మెదడులోని శ్రవణ, చలన భాగాలు రెండూ చురుగ్గా పాల్గొని జ్ఞాపకశక్తి బలపడుతుంది. కబుకి థియేటర్, టైకో డ్రమ్మింగ్, పండుగలలో "వస్షోయ్" లేదా "యోయ్" వంటి ఉత్సాహపూరిత నినాదాలను సమూహంగా పలకడం ద్వారా ఐక్యత, ఉత్సాహం పెరుగుతాయి.

ఈ జపనీస్ పద్ధతులు కేవలం విద్యార్థులకే కాకుండా, దైనందిన జీవితంలో విషయాలను గుర్తుంచుకోవాలనుకునే ప్రతి ఒక్కరికీ ఉపయోగపడతాయి. వీటిని ఆచరణలో పెట్టడం ద్వారా జ్ఞాపకశక్తిని మెరుగుపరచుకుని, మతిమరుపు సమస్యను అధిగమించవచ్చు.

Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt. Ltd., D.No:33-5-9, Papaiah Street, Seetharampuram, VIJAYAWADA, Krishna District, Andhra Pradesh and Published from H.No:24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line Cross, VIJAYAWADA 520 003, Krishna District, Andhra Pradesh.
Editor : Konduri Srinivasarao, RNI Title code No : APTEL 2021/80559, Phone No : 9948877444, Email id : konduri9999@gmail.com.